

**కూటమిలో రైతులకు వెన్నుపోటు**

కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు.

- 8లో..



**విద్యాశాఖ బదిలీల్లో ఆ ఇద్దరిదే ఇష్టారాజ్యం**

విద్యాశాఖ ఉద్యోగుల బదిలీల్లో ఓ ఇద్దరు ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 8లో..




**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### ఎంసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



292 ర్యాంకు సాధించిన రాజు వెంకట హాసినిని అభినందిస్తున్న తల్లిదండ్రులు



ఎం.సౌమ్యశ్రీ (426వ ర్యాంకు)



ఆర్.సుకుమార్ సాయి (625వ ర్యాంకు)

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఈఏపీ సెట్–2025 పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో జిల్లాలో మొత్తం 11,007 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు 10,603 మంది హాజరయ్యారు. వారిలో 7332 మంది క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన వారిలో బాలురు 3973 మంది, బాలికలు 3359 మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో జిల్లాలో మొత్తం 3387 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3127 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 2883 మంది క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన వారిలో బాలురు 819 మంది, బాలికలు 2064 మంది ఉన్నారు. ఒంగోలు నగరానికి చెందిన రాజు వెంకట హాసిని ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 292 వ ర్యాంకును సాధించింది. శ్రీ సరస్వతి విద్యాసంస్థలకు చెందిన ఆర్.సుకుమార్‌సాయి 625వ ర్యాంకు, కె.లోకక్రిటీ 897వ ర్యాంకు, గుణశేఖరరెడ్డి 935వ ర్యాంకు సాధించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని ఎం.సౌమ్యశ్రీ ఇంజినీరింగ్ విభాగంలో 426వ ర్యాంకు సాధించారు.

# రేషన్ కార్డుకు పరేషాన్ !

కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులో సమస్యలు లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నాయి. దరఖాస్తు గడువు నేటితో ముగుస్తున్నా ఇప్పటి వరకు చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. అడ్డగోలు నిబంధనలు, సాఫ్ట్‌వేర్‌లో సమస్యలతో గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు లక్షల్లో ఉండగా నేటికీ దరఖాస్తుల సంఖ్య 7 వేలు కూడా దాటలేదని, నిబంధనలు మార్చి సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

- రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియలో సర్వర్ సమస్యలు
- నిబంధనలు సవరించి, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలంటున్న లబ్ధిదారులు
- దరఖాస్తుదారులు లక్షల్లో ఉన్నా.. అరకొరగా నమోదు
- నేటితో ముగుస్తున్న రేషన్‌కార్డుల దరఖాస్తు గడువు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం గత సంవత్సర కాలంగా ప్రజలను ఊరిస్తూ వస్తున్న కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు లబ్ధిదారులకు చుక్కలు చూపుతున్నాయి. రేషన్‌కార్డు దరఖాస్తు గడువు ఈనెల 9వ తేదీతో ముగుస్తున్నా నేటికీ సాఫ్ట్‌వేర్‌లో ప్రభుత్వ నిబంధనలు మార్చకపోవటంతో లబ్ధిదారులు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. నేటితో దరఖాస్తు గడువు ముగుస్తుండటంతో గడువు పెంచటంతో పాటు సాఫ్ట్‌వేర్‌లో నిబంధనలు సరళతరం చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

**నిబంధనలతో దరఖాస్తుదారుల ఇబ్బందులు:**

దరఖాస్తు ప్రక్రియలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు సాఫ్ట్‌వేర్‌లో మార్చాల్సిన అవసరం ఉందని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌లో సమస్యలివీ..

- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు ఉన్నప్పుడు కొడుకుకు పెళ్లయి కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే మొదట భార్య పేరును ఈ కార్డులోకి మార్పించుకోవాలి. తరువాత 21 రోజులకు కొడుకు, కోడలుకు ప్రత్యేకంగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ వీరికి పిల్లలు పుడితే ఆ పిల్లలను వీరి కార్డులోకి ఎక్కించుకోవాలంటే మరో 21 రోజులు గడువు ఉంటుంది. ఈ విధంగా ఒక పేరు కార్డులో నమోదు కావాలంటే రోజుల తరబడి గడువు ఉంటే ఈ లోగా దరఖాస్తు గడువు ముగుస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు.
- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, కోడలు ఉంటే కూతురుకు పెళ్లయి వారికి వేరే కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నప్పుడు ఈ కార్డులో కార్డుదారుని కూతురు స్థానంలో కోడలు అని నమోదు అయినా, కోడలు స్థానంలో కూతురు అని నమోదైనా.. కార్డుదారునికి సంబంధించి బంధుత్వంలో తేడాలు ఉంటే వారి పేరు తొలగించటానికి కుదరటం లేదు.
- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, కోడలు ఉన్నప్పుడు ఉదాహరణకు రేషన్‌కార్డులో కార్డుదారుని కోడలుకు సంబంధించి కోడలు అని కాకుండా ఎస్‌ఏ అని ఉంటే కోడలు పేరు కార్డులో నుంచి తొలగించలేకపోతున్నారు.
- భార్యాభర్తకు కొత్త రేషన్‌కార్డు కావాలన్నప్పుడు వారి ఆధార్‌కార్డులో స్థానికంగా కాకుండా వేరే అడ్రసు ఉంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంతేకాక ఇంటి మ్యాపింగ్ కూడా జరగటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆధార్‌కార్డులో చిరునామాలు సక్రమంగా ఉంటేనే ఇంటి మ్యాపింగ్ అవుతుందని, ఇంటి మ్యాపింగ్ అయితేనే కొత్త రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కలుగుతుందని చెబుతున్నారు. ఆధార్‌లో చిరునామాల తేడా కారణంగా పాత కార్డు నుంచి వీరి పేర్లు తొలగించినా ఇంటి మ్యాపింగ్ కావటం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.
- రేషన్‌కార్డు దరఖాస్తులో కరెంటు బిల్లు అధికంగా వచ్చినా కొత్త కార్డుకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ కరెంటు బిల్లులు తప్పులు వచ్చి విద్యుత్ శాఖ అధికారుల ద్వారా తప్పులు సరిచేసుకున్నా కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు నెలరోజుల సమయం పడుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రేషన్‌కార్డు ఎవరిపేరు మీద ఉంటుందో ఆ కార్డుదారుడు మళ్లీ కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం లేదని అధికారులు చెప్పున్నారు.




**వీఆర్‌ఓల సమస్య**

రేషన్‌కార్డుల మంజూరులో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. చాలా మండలాల్లో రెండు నుంచి నాలుగు గ్రామాలకు ఒక రెవెన్యూ అధికారి ఉండటంతో అతని కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారి దరఖాస్తుపై సంతకం చేస్తేనే డిజిటల్ అసిస్టెంట్ దరఖాస్తు నమోదు చేయటానికి అవకాశం ఉంటుంది.

**నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు**

ప్రభుత్వ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఈనెల 6వ తేదీ శుక్రవారం సాయంత్రానికి జిల్లాలో పాత రేషన్‌కార్డులో పేరు నమోదు చేసుకోవటానికి దరఖాస్తు చేసుకున్న వారు 42,390, పాత కార్డులో పేరు తొలగింపునకు దరఖాస్తు చేసుకున్న వారు 1,024, కొత్త రేషన్‌కార్డుల కోసం 6,929, రేషన్‌కార్డులో పేర్లు విడగొట్టడానికి 4,700, రేషన్‌కార్డును ప్రభుత్వానికి అప్పగించటానికి దరఖాస్తు చేసుకున్న వారు 19, ఆధార్‌కార్డులో తప్పులను సరిచేసుకోవటానికి 754, రేషన్‌కార్డులో అడ్రసులు మార్చుకోవటానికి దరఖాస్తు చేసుకున్నవారు 1,882 మంది ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం ఈనెల 9వ తేదీ దరఖాస్తు గడువు ముగుస్తుండగా గ్రామ సచివాలయ సిబ్బంది మాత్రం ముగింపు గడువు లేదని, కొత్తకార్డు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందని చెబుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారికంగా గడువుతేదీ పెంచితే తప్ప మాకు నమ్మకం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు.

**సాఫ్ట్‌వేర్‌ను సరళతరం చేస్తేనే..**

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకునే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవానికి ఎటువంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాక కొత్త రేషన్‌కార్డుల నమోదుపై గ్రామ సచివాలయ అధికారులకు అవగాహన కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో చాలామంది దరఖాస్తు నమోదులో సమస్యలు తలెత్తినప్పుడు ఏం చేయాలో అర్థం కాక ఇతర అధికారులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇన్ని సమస్యలతో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు లక్షల్లో ఉండగా దరఖాస్తుదారుల సంఖ్య నేటికీ 7 వేలు కూడా దాటలేదు. కూటమి ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామని ప్రకటనలే తప్ప ఆచరణలో అందని ద్రాక్షలా ఉందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నమ్మించి నయవంచన



కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

- మాన్యువల్ కౌన్సెలింగ్‌పై మాట తప్పిన విద్యాశాఖామంత్రి లోకేష్
- వెబ్ కౌన్సెలింగ్ వద్దు.. ఉపాధ్యాయులతో పెట్టుకుంటే ప్రభుత్వాన్నే మార్చేస్తాం
- ఉపాధ్యాయుల ముట్టడితో దద్దరిల్లిన ప్రకాశం భవన్
- వందలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు
- రోడ్డు పై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు





మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.మంజుల

ఒంగోలు సిటీ: ఎస్జీటీ, పండిట్లు, పీఈటీల బదిలీలను మాన్యువల్ విధానంలో నిర్వహిస్తామని మాట ఇచ్చిన విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నమ్మించి మోసం చేశారని, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఆదివారం జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలెక్టరేట్ లోపలికి వెళ్లకుండా గేట్లు వేశారు. ఉపాధ్యాయులను లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పెట్టుకుంటే ప్రభుత్వాన్నే మార్చేస్తామని హెచ్చరించారు. ఇది చరిత్రలో రుజువైన సత్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహారిస్తోందని విమర్శించారు. 13,777 ఎస్జీటీలకు గాను కేవలం 177 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారు కూడా అధికారుల ఒత్తిడి వల్లే దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వం అత్యంత హేయంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ జరిపిన చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నమ్మించి మాట తప్పిన ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు ఎప్పటికీ మాన్యువల్ కౌన్సెలింగే కావాలని, వెబ్ కౌన్సెలింగ్ వద్దని తేల్చిచెప్పారు. అయితే మాన్యువల్ కౌన్సెలింగ్ సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని అన్నారు. ఒక్కొక్కరూ ఎన్ని ఆప్షన్లు అయినా పెట్టుకోవచ్చని నమ్మబలుకుతున్నారని, దీనిని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు ఎవరూ వెబ్ ఆప్షన్ పెట్టుకోవద్దని సూచించారు.

రాష్ట్రంలో 13,777 ఎస్జీటీలకు గాను కేవలం 177 మంది మాత్రమే వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారని చెప్పగా ముట్టడిలో ఉన్న వందలాది మంది ఉపాధ్యాయులు షేమ్ షేమ్ అంటూ నినదించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, ప్రభుత్వ వైఖరి నశించాలని, బదిలీల చట్టాన్ని మార్చాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు షేక్ అబ్దుల్ హై, వీరాంజనేయులు, రవి, కె.ఎర్రయ్య, బి.వెంకటరావు, లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసులు, దిలీప్‌కుమార్, మాధవరావు, వై.వెంకటరావు, హిమజ, పులి శ్రీను, ఎస్. ఆంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ ముట్టడిలో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీ, పీఈటీ, పండిట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సీనియారిటీ జాబితాలో ఉన్న లోపాలను సరిచేసి ఫైనల్ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు.
- ఎస్టీయూ రాష్ట్ర ప్రతినిధి చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీయూఎస్ రాష్ట్ర ప్రతినిధి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వెంటనే చర్చించాలని కోరారు.
- ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి మాట్లాడుతూ ఉద్యమం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. బీటీఏ రాష్ట్ర ప్రతినిధి పర్రె వెంకటరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ గేటును ముట్టడిస్తున్న ఉపాధ్యాయులు

**వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కష్టాలు**



వెబ్ కౌన్సెలింగ్ పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయుల మీద తీవ్రమైన ఒత్తిడికి గురి చేయడం సమర్థనీయం కాదు. నాలుగు రోజులు ఆలస్యం అయినా మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహించడం మంచిది. దీని వల్ల ఎనిమిది సంవత్సరాల పాటు ఎలాంటి సమస్య లేకుండా ఉపాధ్యాయుడు విధులు నిర్వహించగలడు. ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం విచారకరం.

– షేక్ అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

**ఉపాధ్యాయులను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం**



రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్లనే ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సి వచ్చింది. ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ప్రభుత్వం ఒక రకంగా స్పందిస్తుంది. అధికారులకు మరో రకంగా ఉత్తర్వులు జారీ చేస్తోంది. ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. వేలాది మంది ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ వద్దని డిమాండ్ చేస్తున్నారు. మాన్యువల్ విధానంలో బదిలీలు నిర్వహించమని కోరుతున్నారు.

– కె.ఎర్రయ్య, ఎస్టీయూ నాయకుడు

**మూడు వేల ఆప్షన్స్ ఎప్పుడు పెట్టాలి**



రాష్ట్రంలో ప్రతి జిల్లాలోను కనీసం మూడు వేల మంది ఎస్జీటీలు ఉన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఒక్కొక్క ఉపాధ్యాయుడు మూడువేల ఆప్షన్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇది ఎలా సాధ్యం. ప్రభుత్వ విధానం సవ్యంగా లేదు. బదిలీల చట్టాన్ని సవరణ చేసి మాన్యువల్ విధానంలోనే బదిలీలు చేపట్టాలి. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించి విద్యాశాఖామంత్రి నారా లోకేష్ మాట నిలబెట్టుకోవాలి. ఇంగ్లిష్ మీడియం వద్దని ఉపాధ్యాయులు ఎవరూ కోరడం లేదు.

– వాకా జనార్దనరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

**ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టొద్దు..**



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోంది. ఉత్తర్వుల్లో ఒక రకంగాను, అమలులో మరొక రకంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. పదోన్నతుల విషయంలో కూడా వెబ్ కౌన్సెలింగ్ విఫలమైంది. చివరికి మాన్యువల్ గానే పదోన్నతులు కానిచ్చారు. వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు నరకం అనుభవిస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

– పి.వి.సుబ్బారావు, ఏపీటీఎఫ్ కౌన్సిలర్



డీఈఓ కిరణ్‌కుమార్ కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**నేడు యడవల్లిలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు**

రావర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పందేలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్త మార్కాపురం సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ ఎడ్ల పందేల్లో పాల్గొనదలచిన వారు ప్రవేశ రుసుము వెయ్యి రూపాయలు చెల్లించి తమ ఎడ్ల జతల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి నుంచి 8వ బహుమతులు వరుసగా రూ.1,00,116, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99123 49767, 96032 70799 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## క్లుప్తంగా

### రైలు ఢీకొని నాలుగు గేదెలు మృతి

● రూ.2 లక్షల ఆస్తినష్టం



రైల్వే ట్రాక్‌పై గేదెల మృతదేహాలు

**కురిచేడు:** స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అర్ధ రాత్రి గుంటూరు వైపు వెళుతున్న రైలు ఢీకొని నాలుగు గేదెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పడమర గంగవరం పంచాయతీ పరిధిలోని రెడ్డెన్నపల్లి గ్రామానికి చెందిన మన్నెం సుబ్బులుకు చెందిన గేదెలను మేత కోసం వదిలివేశారు. శనివారం సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో ఉదయాన్నే వెతగ్గా..స్టేషన్ సమీపంలో మృతి చెంది కనిపించాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న పోటు పెద కోటయ్య

**ముండ్లమూరు(కురిచేడు):** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఉల్లగల్లు, వెల్లంపల్లి గ్రామాల మధ్య ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన పోటు పెద కోటయ్య, పాపనబోయిన చిన కోటయ్యలు ద్విచక్రవాహనంపై ఉల్లగల్లు వచ్చి పనులు చూసుకుని తిరిగి గ్రామానికి వెళుతున్నారు. వెల్లంపల్లి గ్రామంలో కోళ్లను చికెన్‌షాపులకు వేసి తిరిగి దర్శి వెళుతున్న వ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న పోటు పెదకోటయ్య కుడి కాలు విరిగిపోగా, పాపనబోయిన చిన్నకోటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

### చీమకుర్తి మెయిన్‌రోడ్డులో ఫ్లెక్సీల విధ్వంసం

● వాహనదారులపై పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలు





వాహనదారులపై పడిన ఫ్లెక్సీలు

**చీమకుర్తి:** ఆదివారం సాయంత్రం వీచిన బలమైన గాలుల తీవ్రతకు చీమకుర్తి మెయిన్‌రోడ్డులో ఫ్లెక్సీల విధ్వంసానికి పాదచారులు బెంబేలెత్తిపోయారు. మూడు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు వాహనదారులపై పడటంతో ఇద్దరు వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్టాండ్ నుంచి దాదాపు అర కిలోమీటరు దూరంలో మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా కట్టిన ఫ్లెక్సీలు గాలి దెబ్బకు రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. ఫ్లెక్సీలు ఊడి పడుతుండటంతో రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దుకాణాలకు అడ్డంగా కట్టిన ఫ్లెక్సీలను తొలగించాలని స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని దుకాణాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా ఫ్లెక్సీలు గాలికి ప్రజలపై పడి దెబ్బలు తగిలాయని, మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా సకాలంలో ఎవ్వరూ స్పందించకపోవడంతో స్థానిక రోడ్డు మీద దుకాణాల యజమానులే రోడ్డు మీద పడిన ఫ్లెక్సీలను తొలగించుకున్నారు.

### రైతులకు రాయితీపై కిసాన్ డ్రోన్లు

**టంగుటూరు:**

జిల్లాలో రైతులకు 41 కిసాన్ డ్రోన్లు రాయితీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని సూరారెడ్డిపాలెంలో రాయితీపై వ్యవసాయ శాఖ యంత్ర పరికరాలు, కిసాన్ డ్రోన్ల పంపిణీలో ముఖ్య అతిథులుగా మంత్రి స్వామి, మారటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. కార్యక్రమంలో ఒంగోలు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్బాబు, మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్ నాయక్, ఎంపీడీఓ దేవసేనకుమారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో రైతులకు వెన్నుపోటు

- వ్యాపారుల ప్రయోజనం కోసం రైతులకు తీరని అన్యాయం
- కంపెనీలతో కూటమి నేతల కుమ్మక్కు
- రోజు రోజుకూ ధరలు దిగజారుతున్నా మాయమాటలతో కాలయాపన
- ప్రభుత్వం పట్టించుకోకుంటే రైతులకు ఆత్మహత్యలే గతి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు




సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు

**ఒంగోలు సిటీ:** కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. కంపెనీలతో కుమ్మక్కై రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం రైతన్నకు వెన్నుపోటు చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి పాలనలో ఏ ఒక్క పంటను కొనే నాథుడే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల ప్రయోజనాల కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతుల జీవితాలకు భద్రత కల్పించేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రైతులకు ఏదైనా నష్టం సంభవిస్తే కంపెనీల ద్వారా పరిహారం ఇప్పించారని చెప్పారు. రైతులపై భారం పడకుండా పంటల బీమాను ప్రభుత్వం చేయించిందని తెలిపారు. పంటలకు ఎప్పటికప్పుడు ధరలను నిర్ణయించి రైతు భరోసా కేంద్రంలో మద్దతు ధర బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా మార్కెట్‌లో ఎక్కువ ధర వస్తే అక్కడ అమ్ముకునే వెసులుబాటు కల్పించిందని, ఒక వేళ తక్కువ ధర వస్తే ప్రభుత్వమే కొనుగోలు చేసేదని వివరించారు. జగనన్న పాలనలో ఐదేళ్ల పాటు రైతులు ఎంతో సంతోషంగా గడిపారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు.

**రైతులకు తీరని అన్యాయం..**

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, పంటల బీమా లేకుండా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేవని మార్కెట్‌లో మాత్రం ధరలు మండిపోతున్నాయని చెప్పారు. కూటమి నేతల పాలనలో రాష్ట్రంలో నల్లబజారు వ్యాపారులు రెచ్చిపోతున్నారన్నారు. పొగాకు రైతుల పరిస్థితి రోజు రోజుకూ మరింత దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పైగా ధరలు రాక రైతులు అల్లాడిపోతుంటే మంత్రులు వట్టి చేతులతో వచ్చి వెళ్లిపోతున్నారని, నిత్యం మాయమాటలు చెప్పడం మినహా ఒక్క రూపాయి ధర పెరిగింది లేదన్నారు. పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేయదని, కంపెనీల ద్వారా కొనుగోలు చేస్తామని మంత్రులు చెప్పడం దుర్మార్గమన్నారు. మంత్రులు చేసిన ప్రకటనతో పొగాకు ధర మరింత పడిపోయిందన్నారు. మంత్రుల పర్యటన తర్వాత పొగాకు ధరలు తగ్గడం వెనక ప్రభుత్వ పెద్దలే వ్యాపారస్తులతో కుమ్మక్కైయినట్లు అర్థమవుతుందన్నారు. ఓట్లు వేసిన గెలిపించిన రైతులను వెన్నుపోటు పొడవడం దారుణమన్నారు. పొగాకు ధరలు రాక ఇళ్లలోనే నిల్వలు ఉంచుకున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. వ్యాపారస్తులైతే నష్టాలు వచ్చాయనీ ఐపీ పెట్టి దివాలా ప్రకటిస్తారని, కానీ ఆత్మాభిమానం కలిగిన రైతులు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు రైతులకు మద్దతుగా ఈ నెల 11న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు వస్తున్నారని, జిల్లాలోని రైతులంతా ఈ పర్యటనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, నాగులుప్పలపాడు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, రైతు నాయకులు దాకా పిచ్చిరెడ్డి, శ్రీనివాసరావు, కాకుమాను ఆదిశేషయ్య, జానకి రామిరెడ్డి, నారపురెడ్డి, కొండపి, సంతనూతలపాడు, ఒంగోలుకు చెందిన రైతు నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై పోరుబాట

- పొగాకు రైతులకు అండగా జగనన్న
- జగనన్న పొదిలి పర్యటనను విజయవంతం చేద్దాం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

**సింగరాయకొండ:** గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకు ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులెవ్వరూ ఆనందంగా లేరన్నారు. ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్యంగా పొగాకు, మిరప, కంది, వరి పండించిన రైతులు నష్టాల పాలై అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ నిర్ణయాలతో పొగాకు గరిష్టంగా రూ.360 పలికితే నేడు కూటమి ప్రభుత్వంలో రూ.200 పలకడం కూడా గగనంగా ఉందని మండిపడ్డారు. దిగజారిన ధరలతో అప్పులపాలైన రైతుకు ఆత్మహత్యలే శరణ్యమని, కొండపి మండలం నెన్నూరుపాడు గ్రామానికి చెందిన చల్లా మధుసూదనరెడ్డి ఆత్మహత్యే ఇందుకు ఉదాహరణ అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పొగాకు రైతులకు న్యాయం చేస్తున్నట్లు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారే గానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశంలో మంత్రి స్వామి వ్యాపారులకు అండగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ అవసరంలేదని, విదేశీ ఆర్డర్లు రాలేదని చెబుతున్నారే తప్ప రైతుల పక్షాన మాట్లాడలేదని మండిపడ్డారు. ప్రతి రోజూ వేలం కేంద్రంలో వందల బేళ్లు తిరస్కరణకు గురవుతున్నా కూటమి నేతల్లో చలనం లేదన్నారు. రైతుల కష్టాలపై జగనన్న పొదిలి వేలం కేంద్రం సాక్షిగా సమర శంఖారావం పూరించే సమయం ఆసన్నమైందని, మనమంతా జగనన్నకు మద్దతుగా భారీగా తరలివెళ్లి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పొగాకు రైతులతో జగనన్న ముఖాముఖి నిర్వహిస్తారని, వీరిలో మర్రిపూడి రైతులు ఉంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పోలీసులు అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, దిద్దుగుంట మల్లికార్జునరెడ్డి, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

## జగనన్న పోరుబాట విజయవంతం చేద్దాం

● మాజీ మంత్రి మేరుగు నాగార్జున

**మద్దిపాడు:** పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు ఈనెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఏ పంట సాగు చేసినా రైతులకు గిట్టుబాటు ధర అందక నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి సాగు చేసిన రైతులు ఉరి వేసుకునే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మిర్చి రైతుల గోడు వినే వారే కరువయ్యారన్నారు. పొగాకు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని విశ్వసించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో పొగాకు రైతులను ఆదుకునేందుకు రూ.118 కోట్లు వెచ్చించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు ఏ పంట వేసినా మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఏనాడు రైతుల గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా రూ.36 వేల పైచిలుకు పలికితే నాడు రూ.20 వేలకు కూడా కొనే పరిస్థితి లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వేలం కేంద్రాలకు వెళ్లి పరామర్శిస్తే..ఆ మరుసటి రోజే ఇద్దరు మంత్రులు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి వెళ్లిపోయారని మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ ద్వారా వైట్‌బర్లీ, బ్లాక్ బర్లీ కొనుగోలు చేయిస్తామని చెప్పి పది రోజులు దాటినా ఇప్పటికీ పత్తా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకును కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని మండిపడ్డారు. రైతులకు అండగా ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, వాకా కోటిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు ఎంపీపీలు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వాకా అరుణ కోటిరెడ్డి, బుడంగుంట విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పోలినేని కోటేశ్వరరావు, కందుల దానియేల్ పల్లపాటి అన్వేష్, దుంపా రమణమ్మ, బొమ్మల రామాంజనేయులు, గుడ్లపాతల రవి, బెజవాడ రాము, మద్దా లక్ష్మీనారాయణ, బుడంగుంట నాగేశ్వరరావు, నాదెండ్ల మహేష్, పైనం ప్రభాకర్, చీదర్ల శేషు, శ్రీలల సురేష్, కంకణాల సురేష్, గండు హరిబాబు, అక్కి సాంబశివరావు, నాయిపాను ప్రవీణ్, ఎం రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన



ప్రభపై మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన నాయకులు

- ఏడాది పాలనలో చంద్రబాబు చేసింది ఏమీ లేదు
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

**కొనకనమిట్ల:** రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, ఏడాది పాలనలో ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటీ కూడా చేయలేదని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. కొనకనమిట్లలో పురాతన ఆలయం అంకాలేశ్వరి(అంకాలమ్మ తల్లి జాతరను) పురస్కరించుకొని శనివారం రాత్రి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. సూపర్ సిక్స్‌కు అతీగతి లేదని, కానీ వారి కార్యకర్తలు, నాయకులు సంపాదించుకోవడానికి వాటర్ షెడ్, నీటి తొట్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని విమర్శించారు. గతంలో జగనన్న పాలన సంక్షేమ పథకాలతో అభివృద్ధి పరుగులు పెడుతూ ప్రతిరోజూ పండగలాగే ఉండేదని గుర్తు చేశారు. కానీ కూటమి పాలనలో ప్రజా సంక్షేమాన్ని మరిచి దోచుకోవడమే పరమావధిగా పాలన సాగుతోందని మండిపడ్డారు. ఎంతో శ్రమతో పార్టీ ఆధ్వర్యంలో ఏటా ప్రభలను ఏర్పాటు చేస్తున్న కొనకనమిట్ల వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అన్నా ప్రత్యేకంగా అభినందించారు. తొలుత అన్నా రాంబాబును పార్టీ నాయకులు శాలువా, పూలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మెట్టు అల్లూరురెడ్డి, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ, దిబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, నాయకులు సూరవరపు పెదవెంకటరెడ్డి, వేంపాటి తిరుపతిరెడ్డి, వేంపాటి పోలిరెడ్డి, పునుగోటి వెంకటస్వామిరెడ్డి, యక్కంటి తిరుపతరెడ్డి, ఎస్ రామగోపాలరెడ్డి, విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, బీసీ నాయకులు పాలూరి వెంకటేశ్వర్లు, పార్లపల్లి సిద్దానబి, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ బదిలీల్లో ఆ ఇద్దరిదే ఇష్టారాజ్యం

- ఆఫీసు బేరర్లను పట్టించుకోని పరిస్థితి
- తీరు మారని విద్యాశాఖ అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఉద్యోగ సంఘాల నేతలు సిద్ధం

**ఒంగోలు సిటీ:** విద్యాశాఖ ఉద్యోగుల బదిలీల్లో ఓ ఇద్దరు ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా విద్యాశాఖలో పనిచేసే ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. విద్యాశాఖలో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ బదిలీలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేసే వివిధ క్యాడర్లలో ఉద్యోగుల బదిలీల విషయంలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉద్యోగులను అనేక ఇబ్బందులు గురిచేస్తున్నారు. బదిలీల్లో ప్రభుత్వం ఉద్యోగ సంఘాల బేరర్లకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ బదిలీల్లో అవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన చేస్తున్నట్లు తెలిసింది. బదిలీల ప్రక్రియ నిర్వహించే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఉద్యోగుల బదిలీల్లో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం బదిలీల మార్గదర్శకాల్లో జారీ చేసింది. ఆయా ఉద్యోగ సంఘాల ఆఫీసు బేరర్లు పనిచేస్తుంటే సంబంధిత ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు లేఖ ఇస్తే తదనుగుణంగా ఆ లేఖను సంబంధిత జిల్లా శాఖల అధికారులకు పంపుతారు. అయితే ఇప్పటికే విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆఫీసు బేరర్ల వివరాలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆ ఉద్యోగ సంఘాల నాయకులు ఇచ్చారు. కలెక్టర్ నుంచి జిల్లా విద్యాశాఖాధికారికి ఆ ఆఫీసు బేరర్ల వివరాలు కూడా వచ్చాయి. అయితే విద్యాశాఖ కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే ఒక అధికారి, ఒక ఉద్యోగి తమ ఇష్టారాజ్యంగా ఉద్యోగుల బదిలీలను చేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగుల బదిలీల విషయంలో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు కూడా జోక్యం చేసుకొని పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపారనే ఆరోపణలు వస్తున్నాయి. బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియాల్సి ఉండటంతో ఆదివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తమకు అనుకూలురైన ఉద్యోగులను తెచ్చుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అందుకు కార్యాలయంలో పనిచేస్తున్న ఆ ఇద్దరూ నేరుగా బేరసారాలు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ బదిలీలకు సమయం సమీపిస్తుండటంతో జిల్లా విద్యాశాఖాదికారి కార్యాలయంలో జరుగుతున్న అవినీతి తంతుతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అలాగే డీఈఓ కార్యాలయంలోని అధికారి తలుపులు వేసుకొని మరి బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు సమాచారం.


**ఉద్యోగ సంఘాల నాయకులకు మొండిచేయి..**

తమకు బదిలీ అయ్యే అవకాశం లేకపోయినా జిల్లా విద్యాశాఖాధికారిని తప్పుదారి పట్టించి బదిలీ చేసేందుకు కుట్ర చేసున్నారని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే విద్యాశాఖపై అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలతో కాసులంటే అక్కడ ఏ పనైనా అయిపోతుందనే భావన నెలకొందని ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నాయి. ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చినా జిల్లా విద్యాశాఖలో ఉద్యోగ సంఘాల బేరర్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై ఉద్యోగ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు సమాయత్తం అవుతున్నాయి.

## సూర్యప్రభ, హంస వాహనంపై నారసింహుడు



సూర్యప్రభ వాహనంపై నారసింహుడు



హంస వాహనంపై..

**సింగరాయకొండ:** పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారు ఆదివారం సూర్య ప్రభ, హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో చలువ పందిళ్లకు బదులు శాశ్వతప్రాతిపదికన రేకుల షెడ్డు నిర్మించామన్నారు. సోమవారం సాయంత్రం శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో పొట్టేలు పందెం ఏర్పాటు చేశామని, స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని వివరించారు.

## ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

● ఆటో డ్రైవర్ మృతి



జగదీష్‌కుమార్ మృతదేహం

**సింగరాయకొండ:** మామిడి కాయల ఖాళీ ప్లాస్టిక్ ట్రేలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ పోట్లేళ్ల జగదీష్‌కుమార్(20) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయరహదారిపై జీవీఆర్ ఆక్వా కంపెనీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీకి చెందిన జగదీష్‌కుమార్ ఉలవపాడు మండలం కొల్లూరుపాడులో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ప్రతిరోజు లాగే ఒంగోలుకు మామిడికాయలు తీసుకుని వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆటో జీవీఆర్ ఆక్వా కంపెనీ సమీపంలోని రాగానే వెనకాల వేగంగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఘటనలో ఆటో బోల్తా పడటంతో కిందపడిన జగదీష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ ట్రక్కును రోడ్డుపై వదిలి ఇంజన్‌తో సహా పరారయ్యాడు. మృతునికి వివాహం కాలేదు. చేతికి అందివచ్చిన కొడుకు అకాల మరణంతో తండ్రి మాల్యాద్రి రోదన చూపరులను కలిచివేసింది. ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.